



పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల వేళ కడియంలో ఓ వీధిలో కూటమి నాయకులు ఫ్లెక్సీలు ఇలా దర్శనమిస్తున్నాయి. - ప్రజాశక్తి, కడియం

కొత్త రేషన్ కార్డులు ఎప్పటికో?

- ఆశగా ఎదురు చూస్తున్న అర్హులు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడు? అనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిన విషయం విధితమే. అయితే ఇప్పటికీ కొత్త రేషన్ కార్డుల మంజూరుపై స్పష్టమైన ప్రకటన చేయటక పోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో అర్హులు నూతన కార్డులు కోసం ఎదురు చూస్తున్నారు. సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పష్టమైన సమాధానం రాకపోవటంతో ఆందోళనతో వెనుతిరుగుతున్నారు. గతంలో రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపిక ప్రక్రియ నిరంతరం జరిగేది. అయితే వైసిపి ప్రభుత్వం సంవత్సరంలో రెండు సార్లు మాత్రమే కార్డులు పంపిణీ ప్రక్రియ నిర్వహించింది. ఈ పరిస్థితిని చక్కదిద్దుతామంటూ ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీలు గుప్పించారు. ఇప్పటి వరకు రేషన్ కార్డుల మంజూరుకు రెండు రకాల ఆదాయ పరిమితుల బట్టి రేషన్ కార్డులు మంజూరు చేశారు. కొత్త రేషన్ కార్డుల మంజూరుకు ఆదాయ పరిమితిని మార్చాలా.. తగ్గించాలా? పాత విధానాన్నే కొనసాగించాలా? అనే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. దీనిపై పౌరసరఫరాల శాఖ విధి విధానాలను అధ్యయనం చేస్తోంది. రేషన్ కార్డులు పౌరసరఫరాల శాఖ సరఫరా చేస్తే రేషన్ సరుకులు తీసుకోవడానికి కోవడంతో పాటు పలు సంక్షేమ పథకాలకు తోడ్పడుతోంది. ఈ నేపథ్యంలో ఆదాయ పరిమితి నిర్ధారణ విషయంలో కొత్త రేషన్, హెల్త్ కార్డులజారీపై ప్రభుత్వం పలు మార్పులను చేయాలని యోచిస్తోంది.

ప్రస్తుతం గ్రామీణ అర్బన్ ఏరియాల వారీగా వార్షికాదాయ పరిమితి ఆధారంగానే తెల్ల రేషన్ కార్డును ప్రభుత్వం జారీ చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు అర్బన్ రూ.2లక్షలల్లోపు వార్షిక ఆదాయాన్ని కార్డుల జారీకి ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు సమాచారం. భూ విస్తీర్ణం మాగాని భూమి అయితే 3.5 ఎకరాలు మెట్టభూమి అయితే 7.5 ఎకరాల్లోపు ఉండాలనే నిబంధనలు అమలు చేయడంతో పాటు పట్టణాల్లో సొంత ఇంటి యజమానులకు ఎలాంటి విధి విధానాలను ప్రకటిస్తారో వేచి చూడాల్సి ఉంది. అయితే మరోవైపు కొత్త రేషన్ కార్డులు మాత్రమే కాదు ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్త కార్డులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. కొత్త రేషన్ కార్డుల డిజైన్లను ఎంపిక చేసి ముద్రించి పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం ప్రజల దగ్గర ఉన్న కార్డులపై గత ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖచిత్రం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. క్యూఆర్ కోడ్‌తో పాటు కుటుంబ సభ్యుల చిత్రాలతో వీటిని ముద్రించనున్నారని సమాచారం.. రేషన్ కార్డులలో మార్పులు చేర్పులు, కొత్త పెళ్లయిన వారికి కార్డులుజారీ చేయాల్సి ఉంది. ఇప్పటికే వారి కుటుంబానికి ఉన్న రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగించేందుకు స్ప్లిట్ ఆప్షన్‌ను కల్పించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వివాహ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఆధారంగా కొత్త జంటకు రేషన్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా వినియోగంలో లేని కార్డులను తొలగించి కొత్త కార్డులు జారీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుంది. కొందరు కార్డులు దారులు ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు. ఇలాంటివి తొలగించాలని సర్కారు భావిస్తోంది. మరోపక్క కొత్త రేషన్ కార్డులు, స్ప్లిట్, సభ్యులు యాడింగ్, తొలగింపు, చిరునామా మార్పు తదితరాల కోసం పలువురు ఎదురుచూస్తున్నారు.

కొత్త కార్డులు కోసం ఎదురుచూస్తున్నాం...

కొత్త రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవాలి. నాకు వివాహమై 6 నెలలైంది. సమీప సచివాలయం వద్దకు వెళ్లినా స్పష్టమైన సమాధానం రావటంలేదు. గతంలో ప్రతి ఏటా జనవరిలో లేదా జులైలో దరఖాస్తులు చేసే అవకాశం కల్పించేవారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా రేషన్ కార్డులపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడం సరైంది కాదు. రేషన్ కార్డుల జారీకి చర్యలు చేపట్టాలి

- పి. భార్గవి, గృహిణి, ఆర్యాపురం, రాజమహేంద్రవరం



నల్లజర్లలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రాఘవులు గెలుపు కోసం ప్రచారం

ప్రజాశక్తి-నల్లజర్ల

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, నిరుద్యోగుల వ్యతిరేక విధానాలను ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులను అఖండ మెజారిటీతో గెలిపించాలని సిఐటియు జిల్లా నాయకులు కొక్కిరిపాటి వెంకట్రావు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. శనివారం పోతవరం, నల్లజర్ల గ్రామాల్లో సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యవాదులుగా ఫోజులు కొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత నియంతలుగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన కూటమి ప్రభుత్వం, అలా కాకుండా రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బిజెపికి వీర భక్తులుగా మారిపోవడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ రాష్ట్ర ప్రయోజనాలను గాలి కొదిలేసి వ్యక్తిగత ప్రయోజనాలు చూసుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వానికి పట్టిన గతే రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పడుతుందన్నారు. సూపర్-6 హామీలను ఎగ్గొట్టడానికే మత రాజకీయాలను తెర మీదకు తెచ్చారన్నారు. తొమ్మిది నెలలు గడుస్తున్నా నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జరుగుతున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలు అత్యంత ప్రాధాన్యతను సంతరించు కున్నాయన్నారు. చట్టసభల్లో కూటమి తప్పులను ప్రశ్నించాలంటే పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణారావు, యు.రాజేష్. ఎం.రాజు, బి.వీరభద్రం, యు.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించాలని కోరుతూ శనివారం ఉండ్రాజవరంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పట్టభద్రులను కలిశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు, అసంఘటిత రంగ కార్మికులు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలన్నారు. ఉద్యోగుల, కార్మికుల ప్రయోజనాలను కాపాడడంలో 18 ఏళ్ళుగాపిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేసిన కృషిని వివరించారు. ఉద్యోగులు, కార్మికుల ప్రయోజ నాలను కాపాడాలంటే రాఘ వులను తప్పనిసరిగా గెలిపించు కోవాలన్నారు. ఈ ప్రచారంలో టి.వెంకటేశ్వరరావు, ఎన్.శ్రీను, యు.కేదారేశ్వరరావు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో...

ముగిసిన ఉద్భవ్ -2025

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న ఉద్భవ్-2025 వేడుకలు శనివారంతంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముగింపు సభలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.రామచంద్ర మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించినఉద్భవ్ - 2025 వేడుకలు విజయవంతంగా జరిగాయన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ చాలా బాగున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యక్షులు శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఉద్భవ్ కార్యక్రమం చాలా ఘనంగా జరిగిందన్నారు. అనేక రకాల సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, ప్రతిభా ప్రదర్శనలు, ఫుడ్ స్టాల్స్, వస్తువుల స్టాల్స్ ఆకట్టుకున్నాయన్నారు. ఇతర కళాశాల విద్యార్థులు కూడా చక్కగా వచ్చి వేడుకల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.



ముగింపు ఉత్సవాల్లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన



పరిశోధనా కేంద్రంలో ఒడిశా రైతులు

పూల పరిశోధన కేంద్రం సందర్శన

ప్రజాశక్తి-కడియం

ఒడిశాకు చెందిన ఉద్యాన అధికారి ప్రియాంక ఆధ్యర్యంలో ఒడిశా రైతులు మండలంలోని వేమగిరి పూల పరిశోధనా ప్రాంతీయ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డివిఎస్.రాజు పూలసాగు ప్రాధాన్యత, పూల పంటలను ఆశించే తెగుళ్లు, చీడపీడలు చేసే నష్టతీవ్రత, వాటిని నివారణ పద్ధతుల గురించి వివరించారు. అనంతరం రాజానగరం మండలంలోని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రాన్ని వారు సందర్శించారు. అక్కడ సీనియర్ సైంటిస్ట్ రఘునందన్ వీరికి కూరగాయలు మరియు వివిధ రకాల పంటల గురించి వివరించారు. అలాగే కడియపులంకలో సత్యదేవా నర్సరీ(పుల్లా చంటియ్య)ని సందర్శించారు. నర్సరీల్లో ఉండే వివిధ రకాల మొక్కలు గురించి నర్సరీ అధినేత పుల్లా పెద్దసత్యనారాయణ ఒడిశా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కడియం మండలం ఉద్యాన అధికారి డి.సుధీర్‌కుమార్, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన 42వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలు శనివారంతో ముగిశాయి. 14 జిల్లాలు నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ పోటీల్లో బాలికల విభాగం నుంచి మొదటి మూడు స్థానాలను వరుసగా విజయనగరం జిల్లాకు చెందిన ఆర్,మౌనిక, పి.రేణుక, జి.శ్రావణి నిలిచారు. నాలుగో స్థానంలో కర్నూలుకు చెందిన ఎన్.ఈశ్వరి, ఐదో స్థానంలో అనంతపురానికి చెందిన కె.జ్యోతిక, ఆరో స్థానంలో పశ్చిమ గోదావర జిల్లాకు చెందిన కె.మౌనిక ఎంపికయ్యారు. బాలురు విభాగంలో కాకినాడ జిల్లాకు చెందిన పిజెఎండి.రామారావు మొదటి, వి.వినయ్‌కుమార్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సిహెచ్.తారకేశ్వరరావు మూడు, కాకినాడ జిల్లాకు చెందిన ఎల్.త్రిమూర్తులు నాలుగు, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పవన్‌కుమార్ ఐదు, బి.చంటిబాబు ఆరో స్థానాల్లో నిలిచారు. వీరంతా ఒడిశాలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరం, గ్రామ పెద్దలు, దాతలు గద్దె హరిబాబు, గద్దె శేషగిరిరావు, కొండేపాటి రత్నాజీ, నందిన సుబ్రహ్మణ్యం, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేఎన్వి సత్యనారాయణ, ముఖ్య ప్రోత్సాహకులు పి.రవీంద్ర, జి.చంద్రశేఖర్, ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో నిర్వాహకులు, గ్రామ పెద్దలు

ఇంటర్ పరీక్షలకు 23 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మార్చి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు మండలం నుండి 23 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో మండల కేంద్రం, ఉండ్రాజవరం మల్లిన వెంకట నరసమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ నుంచి 20 మంది, సత్యవాడ ఎస్ఐఎస్ఆర్ జడ్‌పిహెచ్ ప్లస్ నుంచి ముగ్గురు విద్యార్థులు హాజరవుతారు. 2023-24 విద్యా సంవత్సరానికి మొదటి బ్యాచ్‌గా ఉండ్రాజవరం నుంచి 13 మంది విద్యార్థినిలు పరీక్ష రాశారని తెలిపారు. ఎంపిపి మొదటి సంవత్సరం 470 మార్కులకు 442 మార్కులతో ఎంబిడి.శిరీష ప్రథమ స్థానం సాధించగా, మొదటి సిఇసిలో తన్విక 500 మార్కులకు 371 మార్కులు సాధించిందన్నారు. 60 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఉండ్రాజవరం నుండి మొదటి సంవత్సరం ఎంపిసికి నలుగురు, సిఇసి 4, రెండవ సంవత్సరం ఎంపిసి 3, సిఇసి 9 మంది సత్యవాడ నుంచి ముగ్గురు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. నిడదవోలులో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో వీరు పరీక్షలు రాస్తారని ప్రిన్సిపల్స్ కెఎస్ఎన్.మాణిక్యాలరావు, సూర్యకాంతం తెలిపారు.



ధర్నా చేస్తున్న రజకులు

చెరువు వద్ద రజకుల ధర్నా

ప్రజాశక్తి - తాళ్లపూడి

రజక వృత్తి చేసుకునే చెరువులోకి గ్రామంలోని మురుగునీటిని పంపించే నిర్ణయాన్ని నిరసిస్తూ ఆ చెరువు వద్ద రజకులు శనివారం ధర్నా నిర్వహించారు. మండలంలోని తిరుగుడు మెట్ట గ్రామంలో సుమారు 60 ఏళ్లుగా రజకులు స్థానిక చెరువులో వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ చెరువులోకి గ్రామంలోని మురుగునీరు పంపించేందుకు అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టారన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షులు, రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య మాట్లాడుతూ రజక వృత్తిదారుల చెరువులు అనేక ప్రాంతాల్లో అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. మరి కొన్నిచోట్ల రాజకీయ కారణాలతో వృత్తి దారులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ విషయాలపై దృష్టి పెట్టి రజకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, పంచాయతీ విస్తరణ అధికారి, గ్రామ కార్యదర్శికి వినతి పత్రాలు అందించారు. ఈ ధర్నాలో పెదవేగి నాగేశ్వరరావు, పోసియ్య, పి.శివలింగం పాల్గొన్నాయి.


బాల నేరస్తుల్లో మార్పును తీసుకురావాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

బాల నేరస్తులను గుర్తించి, వారిలో మార్పు కోసం ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సూచించారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యాలయంలో లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్స్, స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు శాఖ అధికారులతో స్పెషల్ జువైనల్ పోలీసు యూనిట్స్‌కి శిక్షణను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఆదరణ కొరవడిన, వివక్ష గురవుతున్న చిన్నారులు నేర ప్రవృత్తికి అలవాటు పడుతున్నారన్నారు. అటువంటి చిన్నారులను గుర్తించి వారిని సరైన మార్గంలో నడిపించాలన్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టి తీర్చి దిద్దిన నాడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. చిన్నారులు నేరాలకు పాల్పడకుండా వారిని చైతన్య పరచాలన్నారు. ఆ బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఎవరైనా చిన్నారులు నేరాలకు పాల్పడితే వారిని అబ్జర్వేషన్ హోమ్‌లో పెట్టి మళ్లీ నేరాలకు పాల్పడకుండా వారిని తీర్చిదిద్దాలన్నారు. చిన్నారులపై వచ్చే కేసుల్లో పోలీసులు తయారు చేసే డాక్యుమెంటరీ, సాక్షుల విచారణ వంటి అంశాలపై తగు శిక్షణ తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు పనికి వెళ్లిన సమయంలో ఇంటి వద్ద ఉన్న చిన్నారులు చిన్న చిన్న నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. అట్టివారిని గుర్తించి వెంటనే వారి ప్రవర్తన మారే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఎవరైనా వికలాంగ చిన్నారులుంటే అట్టివారిని గుర్తించి వారికి తగు సాయం అందించాలన్నారు. నేరం చేసిన వారిని అరెస్టు చేసే విషయంలో తప్పనిసరిగా తగిన డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అడిషనల్ ఎస్‌పి ఎన్‌బిఎం.మురళి మాట్లాడుతూ జువైనల్ చిన్నారులను అరెస్టు చేసిన రక్షణ విషయంలో మరింత జాగ్రత్త వహించాలన్నారు. బాలికల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టల్స్, కళాశాలల్లో చిన్నారులపై జరిగే దాడుల నివారణ నిమిత్తం కెమెరాలు ఏర్పాటు చేసి డాక్యుమెంటరీస్ ఎవిడెన్స్ వచ్చేలా ఏర్పాటు చేయాలన్నారు. కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరస్తులు వెనుకడుగు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎన్.శ్రీలక్ష్మి, కోనసీమ అడిషనల్ ఎస్‌పి ఎవిఆర్ పిబి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గ్రామాల్లో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - యంత్రాంగం

గోకవరం : గోకవరం గ్రామాన్ని స్వచ్ఛ పంచాయతీగా నిలపాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి.శాంతమణి అన్నారు. శనివారం గోకవరంలో ఇంటింటా చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గోకవరంలో ఇంటింటా చెత్త సేకరణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. ప్రతి గ్రామంలో తడి,పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించడం కోసం ఈ నెల 22, 23 తేదీల్లో రెండు రోజులు శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో సేంద్రియ ఎరువులు పంటలకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారి ఎం.నాగలత, ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు : మండలంలో 22, 23 తేదీల్లో ఇంటింటా నుండి చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. శనివారం ఉదయం చాగలులో నిర్వహించిన కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఆర్.శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించలన్నారు. గ్రామాలలో ఉన్న చెత్తను తొలగించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : తడి, పొడి చెత్తను పంచాయతీ కార్మికులు అందించాలని శనివారం ప్రచారం నిర్వహించారు. గహిణిలకు అవగాహన కల్పించారు. తాళ్లపూడిలో పంచాయతీ కార్యదర్శి, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వీరన్న, అన్నదేవరపేటలో కార్యదర్శి శ్రీనివాస్, మలకపల్లిలో కార్యదర్శి కామేశ్వరి, పోచవరంలో కార్యదర్శి రామలక్ష్మి పర్యవేక్షణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఉండ్రాజవరం : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం పారిశుధ్యం పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొని రోడ్లపై చెత్త, డ్రెయినేజీల్లో సిల్టును తొలగించారు. ప్రజలకు తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎ.ఆంజనేయశర్మ, మండల శానిటరీ కో-ఆర్డినేటర్ కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కడియం : జేగురుపాడులో శనివారం ఇఒపిఆర్‌డి రాంప్రసాద్ తడి పొడి చెత్త, చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పించారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సత్తిబాబు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి విద్యార్థి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి అత్యున్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు, గురువులకు పేరు తేవాలని పలువురు వక్తలు అన్నారు. తాళ్లపూడిలోని కరిబండి విద్యాసంస్థల ప్రాంగణంలో కరిబండి సుబ్బారావు మెమోరియల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఎస్‌కెజి ఆర్ అండ్ ఎస్ఎస్‌కె జూనియర్ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళి, అధ్యాపకులు పాపారావు, సత్యనారాయణ, రవీంద్ర, రాజేష్, గీత, అమరేంద్ర, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఔదార్యం అభినందనీయం

తాళ్లపూడి : విద్యార్థుల అవసరాలు తీర్చడంలో పూర్వ విద్యార్థులు చూపిస్తున్న ఔదార్యం అభినందనీయమని తాళ్లపూడి శ్రీపరస పద్మరాజరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బలక్ష్మి అన్నారు. యర్నగూడెంలోని శ్రీ బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని అదే గ్రామం కేంద్రంగా హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూర్వపు విద్యార్థులు తాళ్లపూడిలోనే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామగ్రిని శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కావలిపురపు బాలకృష్ణ, కార్యదర్శి ప్రసాదు, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యేరుకు చెందిన కాపు ఉద్యమ నాయకుడు, ఆక్వా రైతు రాష్ట్ర సంఘసలహాదారు త్సవటపల్లి నాగభూషణంను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇవి.. చెయ్యేరులో కనుమ రోజున చుట్టుపక్కల గ్రామాలనుండి ఏకాదశ రుద్రులు ప్రభలు తరలివస్తాయి. ఆరోజున చెయ్యేరులో ఘనంగా తీర్థం నిర్వహిస్తారు. అనంతరం ప్రభను గ్రామంలోని వీధులగుండా తీసుకు వెళ్లి గ్రామోత్సవం చేస్తారు. ప్రభను తిరిగి తీసుకు వెళ్లేటప్పుడు. ప్రభ ముందు వెళుతున్న వాహనంలో నిర్వాహకులు ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు. ఆర్కెస్ట్రాలోని మహిళా కళాకారులు నత్యాలు చేయడంతో పోలీసులు ఆర్కెస్ట్రాను ఆపివేశారు. దీనితో స్థానికులు ప్రభను రోడ్డుకు మధ్యలో నిలిపి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇలా కొనసాగుతుండగా సుమారు అర్ధరాత్రి సమయంలో అక్కడికి వచ్చిన నాగభూషణం పోలీసులతో వాగ్వాదానికి దిగారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఆయనను అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.

సారా తయారీదారుడు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మండల పరిధిలోని తుపాకుల గూడెం అసైన్డ్ భూమిలో కొవ్వూరు ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. రాయుడు దానయ్య అనే పాత నేరస్థుడు అసైన్డ్ భూముల్లో రహస్యంగా సారా తయారు చేస్తున్నట్టు గుర్తించారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 35 లీటర్ల సారాను, 16 డ్రమ్ముల్లో ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఐదు కేజీల అమ్మోనియాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దానయ్యపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఇ.రవికుమార్, సిబ్బంది నారాయణ, నాగేశ్వరరావు, సత్యనారాయణ, విఆర్ఓ సాయి పాల్గొన్నారు.


ప్రమాదానికి గురైన లారీ

కాలువలోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి - కాజులూరు

యానం-ద్రాక్షారమ రహదారిలో గొల్లిరేవు వద్ద శుక్రవారం అర్ధరాత్రి లారీ అదుపుతప్పి వంతెన రైలింగ్‌ను ఢీకొని టేకి కాలువలోకి దూసుకుపోయింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...యానాం నుంచి ద్రాక్షారామ వైపు వస్తున్న లారీ అదుపు తప్పి వంతెన ఢీకొట్టి కాలువలో పడిపోయింది. కాలువలో నీరు తక్కువగా ఉండటంతో లారీ ఊబిలో కూరుకుపోయింది. లారీ డ్రైవర్, క్లీనర్ పెద్దపెద్ద కేకలు వేయడంతో స్థానికులు గమనించి వారిని బయటకు తీశారు. వారిద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి గురియైన లారీ కర్ణాటక రాష్ట్రానికి చెందినదిగా గుర్తించినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం శివారు కెనాల్ రోడ్డుపై బైక్ అదుపుతప్పి పడడంతో సామర్లకోట భాస్కర కాలనీకి చెందిన నగరం సత్తిబాబు (42) శనివారం మృతి చెందాడు. స్థానికుల వివరాలు ప్రకారం... కాకినాడలో ఒక ప్రయివేటు కళాశాలలో పీడీగా పని చేస్తున్న సత్తిబాబు విధులు ముగించుకుని సామర్లకోట ఇంటికి చేరుకున్నాడు. అనంతరం మండలంలోని పెద్ద బ్రహ్మదేవం గ్రామం అత్తారింటికి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా సామర్లకోట - ద్వారపూడి కెనాల్ రోడ్డులో బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజశక్తి-కడియం

పలు నేరాలకు పాల్పడిన ఐదుగురు నిందితులను కడియం పోలీసులు అరెస్టు చేశారని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి ఎస్.భవ్యకిశోర్ తెలిపారు. కడియం పోలీస్ స్టేషన్‌లో సిఐ ఎ.వెంకటేశ్వరరావుతో కలిసి శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.కడియం మండలం జేగురుపాడుకు చెందిన గంగరాజు సత్యవతి జనవరి 18న ఆలయానికి వెళ్లి వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న బంగారపు నగలను లాక్కుని పారిపోయారు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన కడియం పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో నిందితులు కొత్తపల్లి త్రిమూర్తులు, కూరాకుల సుబ్బారావు, గాదం శెట్టి వెంకన్న, పచ్చ రాజు, గుమ్మడి సత్యనారాయణమూర్తిలను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరు కడియం, మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీలతో సంబంధం ఉందన్నారు. వారి నుంచి 58 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు వెండి, ద్విచక్ర వాహనం, కాపర్ వైరు, రూ. 50 వేలు నగదు మొత్తం రూ.5.4 లక్షలు విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి భవ్యకిశోర్

హోరా హోరీ...



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టబద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఉభయ గోదావరి జిల్లాలో పట్టభద్రుల స్థానానికి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్న విషయం విధితమే. ప్రధానంగా కూటమి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్యే ఈ పోరు జరుగనుందని సుస్పష్టం. కొన్ని గంటల్లో ప్రచార పర్వానికి తెరపడనుంది. మరో 4 రోజుల్లో పోలింగ్ సైతం జరగనుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాలతో మొదలై నియోజక వర్గ కేంద్రాల వరకూ ప్రచారాస్త్రాలకు పదును పెట్టారు. ఓ వైపు ప్రకటనలు, మరోవైపు సోషల్ మీడియాలోనూ ప్రచారాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు తరుపున ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు ముమ్మరంగా ప్రచారంలో పాల్గొంటున్నాయి. స్వచ్ఛందంగా వచ్చి రాఘవులును గెలిపించాలని, ఆయన గెలుపు ఆవశ్యకతను వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కూటమి అభ్యర్థి మాత్రం కుల, మత సమీకరణల ప్రాతిపదికన ప్రచారాన్ని చేసుకుంటున్నారు. ఈమేరకు నియోజక వర్గ కేంద్రాల్లో సమావేశాలకు సైతం నేటి నుంచి తెరలేపారు. ఈ సమావేశాల మాటున తాయిలాల ఎరవేసేందుకే అనే అనుమానాలు ఇతర అభ్యర్థుల నుంచి వినిపిస్తున్నాయి. కూటమి అభ్యర్థి పట్ల అధికార యంత్రాంగా కూడా సానుకూలంగా వ్యవరించడం పలు విమర్శలకు తావిస్తోంది. మరి చివరి సమయంలో తాయిలాలన ఉన్నతాధికారులు ఎలా అడ్డుకుంటారో వేచి చూడాలి..

మరో వైపు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రకటన, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం వంటి ప్రక్రియలను అధికారులు పూర్తి చేశారు. మరో వైపు కొత్త ఓట్ల నమోదుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి యువతను ఓటర్లుగా చేర్చుతున్నారు. రిటర్నింగ్ అధికారుల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. అధికార ప్రతిపక్ష పార్టీలతో ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించడంతో పాటు రాబోయే ఎన్నికల విధులతో ప్రత్యక్ష సంబంధం ఉన్న పలువురు అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఎన్నికల కేంద్రాలపైనా ఓ స్పష్టత వచ్చింది. ఓటింగ్ సామగ్రి సైతం రాష్ట్ర ఎన్నికల సంఘం పంపింది. రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షములో వీటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరిచారు.

పరీక్షా సమయం...

విద్యార్థులలో పరీక్షల ఫియర్ మొదలైంది. మార్చిలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే విద్యాశాఖ ప్రకటించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఆయా విద్యాసంస్థలు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం విధితమే. పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో గత రెండేళ్లుగా జిల్లా పూర్తిగా వెనుకబడిన విషయం విధితమే. గత పరిస్థితుల నుంచి పాఠాలను తీసుకుని ఈ సారైనా మెరుగైన ఫలితాల దిశగా అడుగులు వేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముందుగానే మంటలు

వేసవి పూర్తిగా రాకుండానే జిల్లాలో ముందుగానే మంటలు మొదలయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 6 నుంచి 8 డిగ్రీల వరకూ పెరిగాయి. భానుని ధాటికి ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత అధికమవుతోంది. మరో వైపు అప్రకటిత విద్యుత్ కోతలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ వినియోగం జిల్లాలో 21 మిలియన్ యూనిట్లకు చేరటంతో అప్రకటిత విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి. జిల్లాలో సర్వీసు సంబంధిత సమస్యల పేరుతో అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


పర్యటిస్తున్న ఎంఎల్‌ఎ అశోక్

గ్రామాల్లో పర్యటించిన ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం పర్యటించారు. ఆయా ప్రాంతాలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ప్రజా పనులశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఫెర్రీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న రోడ్లు, ఐ లవ్ యానాం లోగో నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హిందూ, క్రిస్టియన్ స్మశాన వాటికల్లో జరుగుతున్న మరమ్మతుల పనులను పరిశీలించారు. ఈ పర్యటనలో ప్రజపనులు శాఖ ఇన్‌ఛార్జ్ ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ళ నాగరాజు, చెల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని కెమికల్ ఆధారిత, ఇతర పరిశ్రమలను సేఫ్టీ కమిటీ బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరములో జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహ కమిటీ సమావేశం జరిగింది. దీనికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. భద్రతా ప్రమాణాలు, పరిశ్రమల నుంచి వెలువడే రసాయనాలను, వాయువులు స్థాయిని ఎప్పటికప్పుడు పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించారు. పరిశ్రమల్లో సాంకేతిక అంశాలకు సంబంధించి ఎక్కడ ఎటువంటి చిన్న తప్పిదం జరిగినా ఉపేక్షించే లేదని హెచ్చరించారు. అస్సాగో, ఎపి పేపర్ మిల్, ఠాగూర్ ల్యాబ్, ధరణి కెమికల్ వంటి పరిశ్రమలతో పాటు అన్ని పరిశ్రమల్లోని సాంకేతిక అంశాలపై తనిఖీలు నిర్వహించి నివేదికల సమర్పించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో నోడల్ బందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మాత్రమే పరిశ్రమల నిర్మాణం, నిర్వహణ వ్యవస్థ ఉండాలన్నారు. జిల్లాలో పరిశ్రమలకి ప్రోత్సాహం అందించేందుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఒక్క చోటే ఇస్తున్నట్లు తెలిపారు. అప్లికేషన్స్ పెండింగ్లో లేకుండా కార్యచరణ వేగవంతం చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో నూతనంగా నిర్మించే పరిశ్రమలకు విద్యుత్‌ను అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. మల్కా కార్టూన్ ఫ్యాబ్రిక్స్ వస్త్రాల తయారీలో సేంద్రీయ రంగులు అద్దకం, కుట్టు ప్రక్రియల్లో నైపుణ్యత గలవారికి శిక్షణను అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల శాఖ, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు చేనేత, జౌళి శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించి వాటికి అనుసంధానంగా ఉన్న వాహనాలు జాబితాను, వాహన చోదకుల విధులు, ఆయా వాహనాల నిర్వహణకు సంబంధించి పూర్తి సమాచారం అందుబాటులో ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారికి సూచించారు. గిరిజనుల ఉత్పత్తులను స్థానికంగానే కాకుండా దేశ, అంతర్జాతీయంగా విక్రయాలు జరిపేందుకు ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎంఎస్ఎం ఇంటింటా సర్వేలో భాగంగా జిల్లాలో 92,980 యూనిట్లకు ఇప్పటివరకు 42,949 మాత్రమే జరిగిందన్నారు. మిగిలిన సర్వే వేగవంతం చేయాలన్నారు. విశ్వ కర్మ యోజన కింద లబ్ధిదారులఎంపిక సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వనిధర్, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్, విద్యుత్ శాఖ ఎస్ఇ కె.తిలక్‌కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.మార్టిన్‌లూథర్‌కింగ్, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ , జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాథరావు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జవాబుదారీగా రెవెన్యూ సేవలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంలో జవాబుదారీగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ టి.సీతారామ మూర్తి, కలెక్టరేట్ ఎఒ ఎమ్‌డి.ఆలీలతో కలిసి మండలాల వారీగా రెవెన్యూ అధికారుల పని తీరును సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి ఎక్కువగా రెవెన్యూ పరమైన అర్జీలే వస్తున్నాయన్నారు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యుటేషన్లపై రెవెన్యూ ఫిర్యాదులు, రెవెన్యూ రికార్డుల్లో నమోదులు, ఆదాయ సవరణ, ఎస్-ఎల్‌పి సర్టిఫికెట్లు, ఆర్ఒఆర్ డేటాలో దిద్దుబాట్ల కోసం అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో ఉద్యోగ సంబంధ రెవెన్యూ అభ్యర్థన, రెవెన్యూ ఉద్యోగుల సేవా సమస్యలు ఇంక్రిమెంట్ల మంజూరు, ప్రమోషన్ కోసం అభ్యర్థన, మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు కోసం పెండింగ్ ఫైల్స్ పురోగతిపై అంశాలపై సమీక్షించారు. అలాగే ప్రజలకు జారీ చేయాల్సిన సర్టిఫికెట్లలో జాప్యం, ప్రభుత్వం సేకరించిన భూమికి పరిహారం చెల్లించకపోవడం, భూసేకరణపై తీసుకొన్న చర్యలపై సమీక్షించారు. రెవిన్యూ డివిజన్ అధికారి ప్రతి రోజు కనీసం ఒకసారైనా తహశీల్దార్ వారీగా అర్జీల పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలపై సమీక్ష నిర్వహించాలన్నారు. సిఎంఒ, మంత్రులు, రాష్ట్ర స్థాయిలో వస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం నాటికి భూసేకరణకు సంబంధించి పెండింగ్ అంశాలపై ఫారం-సి ద్వారా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అబ్జెక్షన్‌లేని ప్రభుత్వం భూముల్లో పేదలు నివాసం ఉంటే కరెంటు బిల్లు, వాటర్ టాక్స్ ఆధారంగా వెరిఫికేషన్ చేయాలన్నారు. ఎయిర్‌పోర్ట్, డిఫెన్స్ ల్యాండ్స్, జాతీయ రహదారులు వంటి ప్రాధాన్యతతో కూడిన భూ సేకరణ పనులు వేగవంతం చేసి సోమవారం నాటికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. దీపం పథకం ద్వారా లబ్ధిదారులకు ఇచ్చే సబ్సిడీ వారి బ్యాంకు ఖాతాలో జమయ్యేలా చూడాలన్నారు. ఇప్పటికే వివిధ శాఖల పనితీరుపై క్యూ ఆర్ కోడ్ ద్వారా సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే సమీక్ష నాటికి పెండింగ్‌లో ఉన్న అన్ని రెవెన్యూ అంశాలు పూర్తి చేయాలన్నారు.

జెసి చిన్నరాముడు మాట్లాడుతూ సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం ప్రజల్లో కల్పించడంలో క్షేత్ర స్థాయిలో తహశీల్దార్లు వ్యవహరించే తీరు ముఖ్యమన్నారు. ఆర్‌డిఒ అధ్వర్యంలో మండల వారీగా ఫిర్యాదులు పరిష్కార విధానంపై ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి టి.సీతారామమూర్తి, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఎఒ ఆలీ, తహశీల్దార్లు, కలక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-కడియం

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన స్కౌట్ దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అందరికీ స్కౌట్, గైడ్ విద్యార్థులు అందరికీ ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను వాసుదేవరావు, స్కౌట్ జెండాను స్కౌట్ టీచర్ గొల్లపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. గైడ్ టీచర్ బి.గిరిజ స్కౌట్, గైడ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు మణికుమార్, నాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమేశ్వరుడు పెళ్లి కొడుకాయనే...

ప్రజాశక్తి - సామర్లకోట

మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్లను పెళ్ళి కొడుకు, పెండ్లి కూతురుగా అలంకరించి శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈనెల 24వ తేదీన ప్రారంభం కానున్న మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఈ పూజలను నిర్వహించారు. స్వామి, అమ్మవారికి అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ కంటే జగదీశ్ మోహన్, ఆలయ పండితులు, అర్చకులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

రోడ్డున పడ్డ పశువైద్య సిబ్బంది

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మూడేళ్లగా 1962 హెల్ప్ లైన్ పశువైద్య మొబైల్ క్లినిక్ వాహనాలను నిలిపేసి, కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడంతో వారంతా రోడ్డున పడ్డారు. తమను విధుల్లోకి తీసుకోవాలని, న్యాయం చేయాలని కోరుతున్నారు. ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఫెడరేషన్ అనుబంధం 1962 హెల్ప్ లైన్ వెటర్నరీ మొబైల్ క్లినిక్‌ల యూనియన్ సమావేశం స్థానిక హ్యాపీ పార్క్ వద్ద శనివారం జరిగింది. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.హేమసుందర్, ఎం.చరణ్‌సత్యసాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పశువైద్య మొబైల్ క్లినిక్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎ.హేమసుందర్, ఉపాధ్యక్షులుగా జి.రాజారత్నం, సెక్రటరీగా ఎం.చరణ్‌సత్యసాయి, జాయింట్ సెక్రటరీగా జి.సుప్రవాన్, కోశాధికారిగా కె.సురేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వీరు స్థానిక ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసును కలిశారు. తొలగించిన తమను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. దీనికి ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారు. న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాజేష్, శశి, జ్యోతి, శ్రీను, శివ తదితరులు హాజరయ్యారు.


పశువైద్య సిబ్బందితో సిఐటియు కార్యదర్శి పూర్ణిమరాజు

రెడ్ బుక్ డేపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

రెడ్ బుక్ డే అంటే ఏమిటి అనేదానిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.రాంభూపాల్ అన్నారు. శనివారం స్థానిక ముప్పారపు అచ్చుయ్యమ్మ కళ్యాణ మండపంలో రెడ్ బుక్ డే సందర్భంగా వివిధ ప్రజా సంఘాలతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మికులు వేతనాలపై ఆధారపడి జీవించడానికి, కొంతమంది అత్యంత సుఖవంతమైన జీవితం గడపడానికి కారణాలు ఏమిటి అనే దానిపై పరిశీలించి ప్రచురించిన పుస్తకమేనని అన్నారు రాజ్యం, విప్లవం అనే నినాదంతో 177 ఏళ్ల క్రితం ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా ప్రచురించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆ పుస్తకాన్ని, మరిన్ని గ్రంథాలను ఈ విధంగా చర్చించుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర నాయకత్వం కమ్యూనిస్టు ప్రణాళికతో పాటు ఐవి.లెనిన్ రాసిన రాజ్యం, విప్లవం పుస్తకాన్ని అభ్యసించాలని అన్నారు. రాజ్యం అంటే ఏమిటి? రాజ్యం ఎవరికోసం పనిచేయాలి? ప్రస్తుతం రాజ్యం ఎవరి కోసం పని చేస్తుంది? అనే అంశాలపై వివరించారు. ప్రస్తుతం రాజ్యం ధనికులకు కొమ్ముకాస్తూ కార్మికుల వర్గాన్ని అణిచివేస్తూ ప్రస్తుత ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న పాలకులు ఆ సొమ్మును బడా బాబులకు అప్పనంగా అప్పగిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలంతా ఒక్కటే అని చెబుతున్న రాజ్యంలో అధికారం చేపట్టిన తర్వాత ధనిక, పేద అనే వర్గాలుగా విభజించి పాలిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలి కార్పొరేట్ వ్యవస్థలకు మేలు చేకూరేలా పాలన సాగిస్తున్నారని దయ్యబట్టారు. 177 సంవత్సరాల క్రితం ఫిబ్రవరి 21న ప్రపంచవ్యాప్తంగా ప్రచురించిన పుస్తకాన్ని ఫిబ్రవరి 21న రెడ్ బుక్ డేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ పుస్తకం చదివితే అనేక విషయాలు తెలుసుకునేందుకు వీలు ఉంటుందని సూచించారు. రైతు సంఘం నాయకులు గుర్రాల అప్పారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వివిధ ప్రజా సంఘాల నాయకులు జి.బేబిరాణి పలివెల వీరబాబు, ఇస్సాక్, చీకట్ల సాంబశివకుమార్, ఎం.లక్ష్మి, ఎం.ఆశాజ్యోతి, నక్కళ్ల శ్రీనివాస్, సత్యనారాయణ, చీకట్ల చిన్ని, జి.శ్రీను, కాళ్ల నాగేశ్వరరావు, కె.అప్పారావు, గంగాధర్ పాల్గొన్నారు.



యాచకులకు నిలయంగా బస్ షెల్టర్

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర ఆలయానికి వచ్చే యాత్రికుల కోసం కాలువపై ఉన్న ఇనుప వంతెన వద్ద నిర్మించిన ఆర్‌టిసి బస్ షెల్టర్ బిక్షాటకులకు ఆశ్రమంగా మారింది. దీంతో బస్‌షెల్టర్ వద్ద పరిశుభ్రత లోపించింది. దీంతో బస్ షెల్టర్ వద్ద యాత్రికులు నిలవలేని పరిస్థితి నెలకుంది. యాత్రికుల కోసం గతంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో బస్ షెల్టర్‌ను నిర్మించారు. ఈ షెల్టర్‌ను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ షెల్టర్ వద్ద ఆర్‌టిసి అధికారులు రిక్వెస్ట్ స్టాప్‌కు అనుమతి ఇచ్చారు. దీని పర్యవేక్షణ లేకపోవడంతో బిక్షాటకులకు నిలయంగా మారింది. దీంతో యాత్రికులు నిలువలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈనెల 24వ తేదీ నుంచి భీమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయానికి పెద్దఎత్తున యాత్రికులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బస్‌షల్టర్‌ను శుభ్రం చేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.